# హాస్యకథ

# కుళ్ళుబుద్ధి

మా ఆవిడ ఊరెళ్లింది. ఏం తోచటం లేదు. ఆవిడ వుంటే ఏదో తోస్తుంది అని కాదు. ఇంట్లో ఏకాకిగా వుండే బాధ తప్పుతుంది. తరువాత తను 'స్లిమ్'గా వుండే దానికి పడే అవస్థలు చూస్తుంటే సర్దాగానూ వుంటుంది. అంటే స్టాండ్ సైకిలింగ్ చేయటం, టీవీ ఎదురుగా ఆసనాలు వేయటం, 'ఆవిరి పట్టుకోవడం', కాళ్లు బొక్కెట్లో పెట్టుకోవడం, పొత్తికడుపు దగ్గర లావుతగ్గటానికి మ్యాగ్నటిక్ బెల్టు తగిలించుకుని తిరగటం— ఓహ్! బహు సరదాగా వుంటుందిలేండి.

ఇంత సరదా పోయిందికదా! సరే— ఏదైనా సినిమాకు సరదాగా పోదామని క్రిందికి దిగి వచ్చా! స్వర్గం నుంచి అనుకునేరు— మూడో అంతస్తుమండి యాభై మెట్లుదిగి. రిక్షాలు కనుచూపుమేరలో లేవు. కొద్దిగా తుంపరకూడా పడ్తున్నది. పైకి వెళ్లి గొడుగు తెచ్చుకుందామనుకున్నాను. మళ్లా యాభై మెట్లు ఎక్కే ఓపిక లేదు. అలాగే సెంటర్‌లోకి వచ్చాను. పాన్‌వాలా 'గురూ గారూ! పాన్ రెడీ'! అన్నాడు పాన్ తీసుకున్నాను. ఒకటి దట్టించి రిక్షా దొరక్కపోతుందా— అని చూస్తున్నా! నేను వెళ్దామనుకున్నా సినిమా 'కుళ్ళుబుద్ధి' హాస్యసినిమా. ఆ సినిమా తీసిన డైరెక్టర్‌ది కుళ్ళు బుద్ధిట. తన కులంవారికి తప్ప ఇంకొకరికి స్థానం ఇవ్వడట. కుళ్ళు జోకులతో కుల్లిన సంస్కారంతో గొప్పగా తీసిన సినిమా అని 'పితురీ' పిపీవార పత్రికలో వంటావుదం శ్రీవిష్ణువు వ్రాశాడు. అతని సినీ సమీక్షలు చాలా గొప్పగా వుంటాయని అభిజ్ఞుల వారి అంచనా. అందుకే బయలుదేరాను కుళ్ళుబుద్ధికి, సెకండ్ షోకు. ఇంకెవరయినా తోడు తీసుకుందామనుకున్నాను. బుద్ధి ఒప్పుకోలేదు. చాలా అవుతుంది అంటూ! సరే రిక్షా కోసం చూస్తున్నాను కదా!

ఓ రిక్షావాడు వచ్చాడు రయ్యిన. తుంపర కొద్దిగా తగ్గింది. బెల్ గణ గణా మ్రోగించాడు ఎవరైనా వస్తారా అన్నట్లు. నేను వాడిదగ్గరకు చేరాను. 'ప్రియా'కు అన్నాను.

'నాల్గు' అన్నాడు.

'రెండు' అన్నాను

'నాల్గు' అన్నాడు. సీటుమీద మంచి కూడా దిగలేదు. నాకు క్రింద కాలటం మొదలుపెట్టింది. అయినా అవసరం వాది. ఒక్క రిక్షావాడూ లేదు సెంటర్‌లో. గాలికూడా బాగా వీస్తున్నది.

'మూడు' అన్నాను.

వాడు మాతో మాట మాట్లాడకుండా రయ్యిన ముందుకు వెళ్లిపోసాగాడు.

అంటే 'వద్దనేగా'!

పెద్దగా కేకేసి— వుండమన్నాను. వాడు అక్కడే ఆగాడు. నేను నడుచుకుంటూ పోయి ఎక్కాను. తుపుక్కున ఉమ్మేసి పాన్ వుమ్మామెలేండి.

వాడూ తుపుక్కున వుమ్మేసి— బీడీ పారేసి ఊశేడు లెండి. రయ్యిన తొక్కసాగాడు.

నేనూ మాట్లాడలేదు.

వాడూ మాట్లాడలేదు.

రెండు మూడు గుంటల్లో కావాలని పోనిచ్చాడు. నా నడుం భళక్కు భళక్కు మంది. నడుమును జాగ్రత్తగా చూసుకోకపోతే రేపు పెళ్లాం వచ్చి భ్యారుమంటుంది అనుకూంటూ— జాగ్రత్తగా పిర్రలు కూడా ఆనించకుండా అతి గొప్పగా కూర్చుంటూ థియేటర్ చేరాను.

నాల్గు ఇచ్చాను.

అప్పటికే హౌస్‌ఫుల్! 'కుళ్ళుబుద్ధి'కి.

'కుర్చీ— కుర్చీ...' అంటున్నాడు ఒకడు.




'కుర్చి — కుర్చి' పల్చాను నేను.

'పది... పది'... అన్నాడు వాడు.

'ఐదు...ఐదు...' అన్నాను నేను.

నావంక కూడా చూడకుండా వాడు పోయాడు. ఓరి నీ... నా కొడకా! అనుకుంటూ ప్...ప్... అన్నాను వెనక్కి తిరిగేడు.

ఎనిమిది అన్నాను. వాడు పది వేళ్లు చూపించాడు. అక్కడ మీటరు తిరిగినట్లుగా రీళ్లు తిరుగుతున్నాయ్. ఇక లాభం లేదనుకుని పది ఇచ్చి— లోపలికెళ్లాను. అంతా కుళ్లుకంపు. అందరూ భళ్ళుభళ్ళున దగ్గుతూ నవ్వుకుంటున్నారు సినిమా చూస్తూ. నేను వంగొని నడుస్తూ [ఇది ఆఫీసులో అలవాటయింది దేశపాలనలో] నా సీటుకు చేరాను. ఖర్మ! పక్కన ముసలి వాసన.

ఎలానయితేనేం— నేనూ సిన్మా చూడగల్గేను— దర్శకుడు తన బుద్ధినంతా— అత్యంత శ్రమతో తెరకెక్కించి— తెలుగు జనంమీద కసి తీర్చుకున్నాడు బాబూ! అనుకున్నాను.

ఈ లోపల కరంట్ పోయింది. ముసలి వాసన నా మీదకు రాసాగింది.. భళ్లున వర్షం బయట. సినిమా హాలు కూలిపోతుందేమో అన్నంత హోరు బయట.

జనరేటర్ వేశారు. సినిమా మళ్లా కాస్తంత వెనక్కి జరిగి ముందుకొచ్చింది. ముసలి వాసన ప్రక్కకు జరిగింది. అంతవరకూ తను నాతో సుఖించిందిలెండి.

సినిమా ముగిసింది. వర్షంవల్ల ఇంటర్‌వెల్ ఇవ్వలేదు. భారమైన హృదయంతో, దిగాలుగా, భయం భయంగా బయటకువచ్చాను. నా బుర్రలో బుద్ధి అంతా కుళ్ళినట్లుగానూ, నా మెదడు బయట పడి— దానిమీద ఈగలు, దోమలు సమస్త క్రిమికీటకాలూ దొర్లుతున్నట్లుగానూ ఫీలింగ్ వచ్చింది.

అలా పిచ్చిపిచ్చిగా బయటకు వచ్చాను. ఎప్పుడు తుర్రుమన్నారో జనం అంతా ఎవడికి అందిన దాంతో వాడు తుర్రుమన్నారు.

మళ్లా నా పరిస్థితి శూన్యం!

రిక్షాలు లేవు.

నా దగ్గర గొడుగులేదు. మోకాలి లోతు నీరు. ఇంకా తుప్పర వస్తూనే ఉంది.

చాలామంది ఆడవారు చాలా భాగం ఎత్తుకొని నడిచే పోతున్నారు. ఆ సౌరభం కోసం చాలామంది మొగవారు వారి వెంట పోతూనే ఉన్నారు కళ్ళు చిట్లించుకొని చూస్తూ.

నా అదృష్టం— ఒకే ఒక రిక్షా ఉంది. వాడు రైన్ కోట్‌తో, టోపీతో, చేతికి వాచీతో చాలా దర్జాగా ఉన్నాడు.

'బాబూ! వస్తావా' అన్నాను ప్రేమగా.

—ప్రషాడార్కె

'ఆ!' అన్నాడు.

'నవయుగా హోటల్ దగ్గరకు ఎంత'

'పది రూపాయలు'

'పది రూపాయలా! నేనడిగింది నవయుగా హోటల్ దగ్గరకు'.

'నేను చెప్పింది అక్కడేనండి— గుంటూరుకు కాదు...' అన్నాడు. [అక్కడినుండి గుంటూరు ఇరవై కిలోమీటర్లు, నవయుగా సెంటర్ రెండు కిలోమీటర్లు].

నాకు మళ్లా క్రింద కాలడం మొదలైంది. ఈ మధ్య పైల్స్‌గూడా కన్పడ్డాయి. బిపి వుండనే ఉంది.

'మూడు' అన్నాను...

'పది' అన్నాడు. అంటూనే పోతున్నాడు. నేను ఆ చలిలో, ఆ వర్షంలో, ఆ మోగాలిలోతు నీటిలో, ఆ చీదరలో— రెండు కిలోమీటర్లు కాదు గదా ఒక అడుగు కూడా వేయలేను.

ధేబ్యం మొగమేసుకొని, నానా బూతులు తిట్టుకుంటూ 'ఐదు' అన్నాను పెద్దగా

'పదీ...' అని అరిచాడు వాడు.

'వుండూ' అని నీర్సంగా పలికి రిక్షా ఎక్కాను.

వాడు రయ్యిన బయలుదేరాడు. రిక్షా నిండా నీరు. మొత్తం తడిచాను. ప్రక్కలనుండి నీరు... నిదానం— నిదానం— అంటున్నా వాడు స్పీడు... స్పీడు...

నేను ఇందాక ఎక్కడ దిగానో అక్కడే ఆగాడు. నేను వింతగా చూట్టం చూసి— నేనిచ్చిన పది తీసుకొని నేనూ మీతో సిన్మాకొచ్చానండి— రిజర్వ్‌డ్‌లో కూర్చున్నా లేండి. మంచి పిల్ల జేరింది లేండి నా పక్కన. మీరు పాపం ముసలమ్మ ప్రక్కన కూర్చున్నారుగా కుర్చీలో— చూశానులేండి— ముందుగా రిజర్వు చేసుకుంటే పోయేది కదండీ... అన్నాడు వాడు— సారీ వారు...

'నీవు ముందే రిజర్వు చేయించావా?' నీరసంగా అడిగాను.

మీ ముందు బాడిగకు రిజర్వు చేయించుకున్నా. మీ బాడిగకు సినిమా చూశా, రిటర్న్ మీ బాడిగతో కలిసి ఈ పూట అరవై— మన సంపాదన— ఇక ఇంటికే అంటూ వెళ్లిపోయాడు. అస్సలు తడవకుండా— నన్ను పూర్తిగా తడిపి. నేను అలా చూస్తుండిపోయాను.

ఎంత ఆనందమున్నది రిజర్వేషన్‌లో.

అందుకే కాబోలు అందరూ రిజర్వేషన్స్, రిజర్వేషన్స్ అంటారు... ఎంత సుఖమున్నది అందులో. నేను పూర్తిగా తడిచిపోయాను.

నా సినిమా ఖర్చు ఇరవైనాల్గు—

వాడి ఆదాయం అరవై! అలుపు సొలుపూ లేకుండా! జై రిజర్వేషన్స్! అంటూ హస్తం చూసుకున్నాను. వాడికి ఇవ్వగా ఇంకో పదినోటు పూర్తిగా తడిచి పోయింది. గబగబా పైకి నడిచాను.

నేను తడిచాను— తుడుచుకుందాం— జలుబు చేస్తుంది— రేపు నా భార్య వస్తే తనస్లిప్ కార్యక్రమం ఓపికతో చూడాలి... ఇలా... ఇలాంటి ఆలోచనలతో కాదు, తడిచిన 'పది'ని 'ఆర' వేద్దామని.

# బెజవాడ గోపాలరెడ్డి గారికి రాజా—లక్ష్మీ అవార్డు



స్వాతంత్ర్య సమరయోధుడు, జాతీయ నాయకుడు, రాజనీతివేత్త డాక్టర్ బెజవాడ గోపాలరెడ్డి గారికి ఈ సంవత్సరం రాజా—లక్ష్మీ అవార్డును ఇస్తున్నట్లు శ్రీ రాజాలక్ష్మీ ఫౌండేషన్ ప్రకటించింది.

జాతి అభ్యుదయానికి నిర్దిష్టమైన బాటవేసిన పండిత జవహర్‌లాల్ నెహ్రూ శతజయంతి సంవత్సర సందర్భంగా ఆయనతో కలిసి పనిచేసిన జాతీయ నాయకులలో ఒకరు, స్వాతంత్ర్య సమరయోధుడు అగు డాక్టర్ గోపాలరెడ్డిగారికి ఈ సంవత్సరం రాజాలక్ష్మీ అవార్డును ఇవ్వడం సముచితంగా ఉంటుందని భావించబడింది. మదరాసులో నవంబర్ 19వ జరిగే ఉత్సవంలో 25,000/- రూపాయల నగదు, ప్రశంసా పత్రం గోపాలరెడ్డిగారికి బహూకరిస్తారు. ఈ అవార్డు గ్రహీతగా వారిని అమెరికాలోని తెలుగు ఫైన్ ఆర్ట్స్ సొసైటీ, న్యూజెర్సీ వారు అమెరికాకు ఆహ్వానించి అక్కడ 'డా. కెవి రావు, డా. జ్యోతిరావు అవార్డు'ను అందచేస్తారు. ముఖ్యమంత్రిగా, కేంద్ర మంత్రిగా, గవర్నర్‌గా వివిధ హోదాలలో జాతికి ఎనలేని సేవచేసిన గోపాలరెడ్డిగారు స్వాతంత్ర్య సమరంలో పాల్గొని ఆరుసార్లు జైలుకి వెళ్లి మొత్తం నాల్గు సంవత్సరాలకు పైగా కారాగార వాసం చేశారు. మదరాసులో రాజాజీ ఆధ్వర్యాన ఏర్పడిన మొట్టమొదటి కాంగ్రెస్ మంత్రివర్గంలో 1937 లో తమ 29వ ఏటనే మంత్రిపదవి నలంకరించారు గోపాలరెడ్డిగారు. ఆ తరువాత ఓపి రామస్వామిరెడ్డి, పిఎస్ కుమారస్వామి రాజాగార్ల మంత్రివర్గాలలో మంత్రిగా చేరి పలు ముఖ్యమైన శాఖలను నిర్వహించారు. ప్రత్యేకాంధ్ర రాష్ట్రం ఏర్పాటయిన తర్వాత, 1955లో గోపాలరెడ్డిగారు రాష్ట్ర ముఖ్యమంత్రి పదవి చేపట్టారు. 1958లో పండిత జవహర్‌లాల్ నెహ్రూ మంత్రివర్గంలో చేరి రేడియో, సమాచార శాఖసహా వివిధ కీలకమైన మంత్రిత్వశాఖలను 1963 వరకు నిర్వహించారు. 1967 నుంచి ఉత్తరప్రదేశ్ గవర్నర్‌గా పనిచేసి 1972 లో ఆ పదవితోపాటు, క్రియాశీలక రాజకీయాల నుంచి కూడా విరమించుకున్నారు. డాక్టర్ గోపాలరెడ్డి గారు గొప్ప సాహితీ ప్రియులు. పన్నెండేళ్ల స్వల్పవ్యవధిలో 16 సంపుటాల స్వీయ కవిత్వాన్ని వెలువరించేరు. అకళంకమైన రాజకీయ నాయకుడిగా ఆయన అన్నివర్గాల వారి గౌరవాభిమానాలందుకున్నారు. గోపాలరెడ్డి గారు నెల్లూరుజిల్లా బుచ్చిరెడ్డిపాలెంలో 1907 ఆగస్టు 5వ తేదీన జన్మించారు. ప్రభుత్వ విద్యాలయాలను బహిష్కరించి బందరు జాతీయకళాశాలలోను శాంతినికేతన్, విశ్వభారతిలో విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగోర్ ఆచార్యకత్వంలో చదువుకున్నారు. వీరికి మూడు భారతీయ విశ్వవిద్యాలయాలు గౌరవ డాక్టర్‌పట్టం ఇచ్చి సత్కరించాయి.

రాజా—లక్ష్మీ ఫౌండేషన్ 1979 నుంచి సాహిత్యం, సంస్కృతి కళలు, విజ్ఞానం, తదితర రంగాలలో విశిష్టులయిన వారిని సత్కరించడానికి రాజా—లక్ష్మీ అవార్డును ఏర్పాటుచేసింది. ఏటా ఆగస్టు 15వ అవార్డును ప్రకటించి, నవంబర్ 19వ ప్రదానం చేస్తుంది.

—పి.వి.రమణయ్య రాజా
మేనేజింగ్ ట్రస్టీ

